క్లుప్తంగా

గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు


పుష్పాలంకరణలో పుట్టపెద్దమ్మ

బేతంచెర్ల: స్థానిక బనగానపల్లె రహదారిలో వెలసిన పుట్ట పెద్దమ్మకు జ్యేష్ఠ మాసాన్ని పురస్కరించుకొని మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు రామకృష్ణ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పుష్పాలంకరణ, కుంకుమార్చన, మహామంగళహారతి నిర్వహించారు. పట్టణంలోని అమ్మవారి శాలలో వాసవీ మాతకు, కొలుములపల్లె రహదారిలోని చౌడేశ్వరీ దేవి, సిమెంట్ నగర్ గ్రామ సమీపాన వెలసిన సుంకులా పమేశ్వరీకి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి


మాట్లాడుతున్న ఎస్ఐ తిరుపాల్

బనగానపల్లె రూరల్ : విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని నందివర్గం పోలీసు స్టేషన్ ఎస్ఐ తిరుపాల్ సూచించారు. మంగళవారం మండలంలోని నందివర్గం గ్రామం జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ హెచ్ఎం వర ప్రసాదరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు మత్తుపదార్థాలు, గుట్కా, మద్యం తదితర వ్యసనాల ప్రమాదంపై ఎస్ఐ అవగాహన కల్పించారు. మద్యం,గుట్కా వంటి వ్యసనాలకు అలవాటు పడితే మీ జీవితాలు ఆర్థికంగా, ఆరోగ్యపరంగా తీవ్రంగా నష్టపోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. తల్లిదండ్రులు మీ పై ఎంతో నమ్మకం ఉంటారని, వారి ఆశయాలకు అనుగుణంగా పట్టుదలతో చదవాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


ప్రమాదంలో గాయపడ్డ విజయ్, సుబ్బరాయుడు

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల– నంద్యాల ఆర్అండ్‌బీ రహదారిలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. స్థానికులు అందించిన సమచారం మేరకు.. దొర్నిపాడుకు చెందిన సుబ్బరాయుడు సొంత పనుల నిమిత్తం బైక్‌పై కోవెలకుంట్లకు వచ్చాడు. పని ముగించుకుని తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా పట్టణానికి చెందిన యువకుడు విజయ్ బైక్‌పై వస్తూ గురుకుల పాఠశాల సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో ఇరువురికి గాయాలు కాగా స్థానిక ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

పారిశ్రామిక పార్క్ ఏర్పాటుకు స్థల పరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ప్యాపిలి: పట్టణ సమీపంలోని 960 సర్వే నంబర్‌లో పారిశ్రామిక పార్క్ ఏర్పాటు చేసేందుకు అవసరమైన స్థలాన్ని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సోమశేఖర్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. పారిశ్రామిక పార్క్‌కు అనువైన స్థలం కేటాయించాల్సిందిగా ఏపీఐఐసీ అధికారులు గతంలో రెవెన్యూ అధికారులను కోరారు. ఈ మేరకు అధికారులు కేటాయించిన 960 సర్వే నంబర్‌లోని 48 ఎకరాలను అధికారులు పరిశీలించారు. స్థలానికి సంబంధించిన వివరాలను తహసీల్దార్ ప్రతాప్ రెడ్డిని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీటీ మారుతి, సర్వేయర్ నాగరాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వీల్ చైర్ అందజేత


వీల్ చైర్మన్ అందజేస్తున్న సీఐ గంటా సుబ్బారావు

బనగానపల్లె రూరల్ : స్థానిక కాత్యాయని మెడికల్ అండ్ సర్జికల్ స్టోర్స్ యాజమాన్యం పోలీసు స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహించే మనోహర్‌రావు తల్లికి వీల్‌చైర్‌ను విరాళంగా ఇచ్చారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి నడువలేని ఆమెకు సీఐ గంటా సుబ్బారావు చేతుల మీదుగా అండ్ సర్జికల్ స్టోర్‌కు చెందిన మారుతికుమార్, రెడ్‌క్రాస్ సంస్థ వైస్ చైర్మన్ నాగార్జునరెడ్డి అందజేశారు.

పశుగ్రాసం కొరత తీరేనిలా!

- నులువుగా అజోళ్ల సాగు
- 25 శాతం ప్రొటీన్లు ఉన్న మేతతో పశువులకు సంపూర్ణ ఆరోగ్యం
- పాడిరైతులకు ఎంతో ఉపయోగం


తొట్టిలో అజోళ్ల మేత విత్తనాలను చల్లుతున్న దృశ్యం (ఫైల్)

డోన్ : వర్షాభావ పరిస్థితుల మూలంగా పాడి పశువుల పోషణ తీవ్ర ఇబ్బందిగా మారింది. పశుగ్రాసం కొరత మూలగా పాడిరైతులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. పశుపోషణకు ముఖ్యమైన దాణ, గడ్డి కొరతతో చాలామంది రైతులు పాడిపశువులను పోషించేందుకు వెనకంజ వేస్తున్నారు. దాణకు బదులు వేరుశనగ, పత్తిచెక్కల కొనుగోలు మూలంగా ఆర్థికంగా భారం కావడంతో పశుపోషణ తలకు మించిన భారంగా మారింది. దీంతో పాడిరైతులు సంఖ్య ఏటేటా తగ్గిపోతోంది. అయితే అజోళ్ల పెంపకంతో పశుగ్రాసం కొరత తీరుతుందని పశుసంవర్ధక శాఖ అధికారులు సూచిస్తున్నారు. 25 శాతం ప్రొటీన్లుగల అజోళ్ల పెంపకాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. రైతులు పశువులకు దాణగా ఉపయోగించుకునేందుకు తమ పొలంలో కొంత భాగాన్ని అజోళ్ల సాగుకు కేటాయిస్తే రోజువారీ వాడకానికి ఉపయోగించుకోవచ్చునని పశుపోషకులకు పశువైద్యశాఖ అధికారులు సూచిస్తున్నారు.

అజోళ్ల పెంపకం చాలా నులువు

రోజూ నాలుగు కిలోల మేర అజోళ్ల దాణ ఉత్పత్తి చేసేందుకు 2.25 ప్లస్ 1.5 మీటర్ల పొడువు, 10 సెంటీమీటర్ల ఎత్తు ఉండేలా మూడు తొట్లు ఏర్పాటు చేసుకోవాలి. ఒక్కో తొట్టిలో 150 జీఎస్ మందం సిల్పాలిన్ సీటు వేసి ఇటికెలపై అంచు వరకు ఉండేలా చూసుకోవాలి. ఇందులో 35 కిలోల భూసారం మట్టిని జల్లెడ పట్టి అడుగున పరచాలి. 45 కిలోల నిల్వ ఉంచిన పశువుల పేడను 20 లీటర్ల నీటితో కలిపి తొట్టిలో వేయాలి. మట్టి, పేడ బాగా కలిసేలా తిప్పాల్సి ఉంటుంది. ప్రతి తొట్టిలోనూ 2 కేజీల తాజా మదర్‌కల్చర్ అజోళ్లను బెడ్ మీద సమానంగా పడేలా చల్లాలి. పైనుంచి నీటిని చిలకరిస్తూ ఉండాలి. వారం రోజుల్లో తొట్టి అంతటా పాచిలా అజోళ్ల ఆకు పాకుతుంది. కిలో అజోళ్ల నుండి వారం రోజుల్లోనే 10 కిలోల వరకు దిగుబడి వస్తుంది. దీనిలో కొంత తీసి దాణగా వాడుకోవచ్చు. తరచూ నీటిని పేడ, మినరల్ మిక్చర్ నీటిని కలిపి తొట్టిలో వేయాలి.


ఎండ పడకుండా షెడ్డు వేసిన దృశ్యం (ఫైల్)

జాగ్రత్తలు

అజోళ్ల పెంపకం తొట్టిలో నేరుగా సూర్యకాంతి పడకుండా చూసుకోవాలి. ఏవైనా చెట్ల ఆకులు పడితే అజోళ్ల కుళ్లిపోయే ప్రమాదం ఉంటుంది. పది రోజులకోసారి తొట్టిలోని నీటిని మారుస్తూ ఉండాలి. 60 రోజులకోసారి తొట్టిలోని పేడ, మట్టిని తీసివేసి మార్చాల్సి ఉంటుంది. ఇలాంటి జాగ్రత్తలతో చేపడితే పశువుల దాణ కొరతను పశుపోషకులు సులువుగా అధిగమించవచ్చు.

పశుపోషకులకు సువర్ణ అవకాశం



ప్రభుత్వం సబ్సిడీపై అందించే గడ్డి విత్తనాలు పశుపోషకుల ఆర్థిక భారాన్ని తగ్గిస్తాయి. పాడి రైతులకు అజోళ్ల మేత పెంపకం పాడిపరిశ్రమ నిర్వహణలో ఎంతగానో ఆర్థిక తోడ్పాటును అందిస్తుంది. గ్రామీణ ప్రాంతాలలోని ఆర్‌బికేలలో ఇందుకు సంబంధించిన సూచనలు, సలహాలను కూడా పశుపోషకులు పొందే అవకాశం ప్రభుత్వం కల్పించింది. – **డాక్టర్ నాగరాజు, పశు సంవర్ధక శాఖ సహాయసంచాలకులు, ప్రాంతీయ పశువైద్యశాల, డోన్**

నేడు మాజీ మంత్రి బుగ్గన రాక

ప్యాపిలి: మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి బుధవారం ప్యాపిలికి రానున్నట్లు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం ఒక ప్రకటలో తెలిపారు. ఉదయం 10 గంటలకు స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయానికి మాజీ మంత్రి రానున్నట్లు తెలిపారు. మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై సమస్యల గురించి చర్చిస్తారని వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు.

27న ఉచిత వైద్య శిబిరం

డోన్ టౌన్ : కర్నూలు కిమ్స్ హాస్పిటల్, స్థానిక కొత్త బస్టాండ్ సమీపానున్న వైద్య పాలి క్లీనిక్ ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీన గురువారం గుండె వ్యాధులకు సంబంధించి ఉచి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సిబ్బంది ఒక ప్రకటనలో తెలిపారు. బీపీ, ఆర్‌బీఎస్, ఇసీజీ, 2డి ఎకో తదితర పరీక్షలు ఉచితంగా చేస్తామన్నారు. గురువారం ఉదయం 10 గంటల నుంచి 2గంటల వరకు వైద్య పరీక్షలు చేస్తామని, సద్వినియోగం చేసుకోవాలన్నారు.

1న ప్రవేశ పరీక్ష

డోన్ టౌన్ : ఏపీ మోడల్ స్కూల్లో 9వ తరగతిలో ప్రవేశానికి ఈ నెల 26న నిర్వహించాల్సిన పరీక్షను జూలై 1వ తేదీకి వాయిదా వేసినట్లు ప్రిన్స్‌పాల్ జాస్మిన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మిగిలి పోయిన 6 సీట్ల భర్తీకి ఈ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నామని, ఈ నెల 28వ తేదీ వరకు స్థానిక స్కూల్లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులందరికీ హాల్ టిక్కెట్ జారీ చేస్తామన్నారు. ఇందు కోసం ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్, ఒక పాస్ ఫొటో తీసుకరావాలని సూచించారు.

ఎంపీడీఓ కార్యాలయానికి మోక్షం లభించేనా!


ఎంపీడీఓ కార్యాలయం

కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్లలోని మండల పరిషత్ కార్యాలయం రెండు దశాబ్దాల క్రితం నిర్మించడంతో అసౌకర్యంగా మారింది. వర్షాకాలంలో అక్కడక్కడ వర్షపునీరు లీకేజీ అవుతుంది. 1999లో నిర్మాణా పనులు పూర్తి చేసి ప్రారంభోత్సం చేశారు. కార్యాలయం గదుల్లోనూ అక్కడక్కడ పగుళ్లు ఏర్పడ్డాయి. ప్రతి మూడు నెలలకొకసారి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు,మండల స్థాయి అధికారులతో నిర్వహించే సర్వసభ్య సమావేశం మీటింగ్ హాల్ ఇరుకుగామారి అసౌకర్యంగా మారింది. సమావేశాలు నిర్వహించుకునేందుకు విశాలమైన మీటింగ్ హాల్ లేక పోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఎంపీడీఓ కార్యాలయాన్ని తీర్చిదిద్దడంతో పాటు విశాలమైన మీటింగ్ హాల్ నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించాలని ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

• రైతన్న బిజీబిజీ


జీలుగను ట్రాక్టర్‌తో దున్నుతున్న ఓ రైతు

బనగానపల్లె : వరినారుమళ్ల తయారీలో రైతులు బిజీ అయ్యారు. ప్రత్యేకించి జిల్లాలోనే బనగానపల్లె నియోజకవర్గంలో వరి ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తారు. నంద్యాల సోనా, కర్నూలు సోనా ఎంతో ప్రసిద్ధి. బనగానపల్లె నియోజకవర్గంలో సుమారు 13వేల వ్యవసాయ బోర్లు ఉండగా వీటి ఆధారంగా 25–30వేల ఎకరాల్లో వరి పంటను సాగు చేస్తారు. ఎస్ఆర్‌బీసీ ఆయకట్టు పరిధిలోనూ వరి పంటను సాగు చేస్తారు. రైతులు వరినారు మళ్ల తయారు చేయడంలో బిజీ అయ్యారు. తెగుళ్ల నివారణతో పాటు నారుమడులు ఏపుగా పెరిగేందుకు జీలుగ పైరు వేసిన పంటను రెండు, మూడు మార్లు దున్ని వరినారుమళ్లు తయారు చేస్తారు రైతులు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత ఉండాలి


తొట్టిని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం

డోన్ : సీజనల్ వ్యాధుల నివారణకు నిరంతరం అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం సూచించారు. స్థానిక 10వ వార్డులో మంగళవారం కమిషనర్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ స్థానికులతో మాట్లాడి తాగునీటి సమస్యపై ఆరా తీశారు. వర్షాకాలంలో నీరు కలుషితం కాకుండా నీటిని కాచి వడపోసుకుని తాగాలని ప్రజలకు సూచించారు. తొట్టలో నీటిని ఎక్కువ రోజులు నిల్వ చేయొద్దని, దోమలు విజృంభించే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగతంతో పాటు పరిసరాల శుభ్రత పాటించాలని ఈ సందర్భంగా కమిషనర్ సూచించారు. కార్యక్రమంలో డీఈ రసూల్, ఏఈ సతీష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ సర్వసభ్య సమావేశం

డోన్ : డోన్ మున్సిపల్ సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం10 గంటలకు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి హాజరవుతున్నారన్నారు. అభివృద్ధి పనులకు సంబంధించి ప్రతిపాదనలను ఆమోదించే అవకాశం ఉన్నందున సమావేశానికి కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, వివిధ శాఖలకు చెందిన అధికారులు తప్పక హాజరుకావాలని ఆయన సూచించారు.

మైనర్ బాలుడిపై పోక్సో కేసు నమోదు

ప్యాపిలి: మండల పరిధిలోని రాచర్ల గ్రామంలో మంగళవారం ఓ మైనర్ బాలుడు మైనర్ బాలికపై అత్యాచారానికి యత్నించాడు. విషయం తెలుసుకున్న బాలిక కుటుంబ సభ్యులు బాలుడిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టిన పోలీసులు బాలుడిపై పోక్సో కేసు నమోదు చేశారు.

ఆలయ భూములకు వేలం పాటలు

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని తిమ్మనాయినపేటలోని పలు దేవాలయాలకు సంబంధించిన భూములకు మంగళవారం ఈఓ చంద్రుడు ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. వెంగోవిందరాజుల స్వామి 7.40 ఎకరాలు, అగస్త్రీరస్వామి, వేణుగోపాలస్వామి, చెన్నకేశవస్వామి ఆలయాలకు కలిపి మొత్తం 30 ఎకరాలకు పైగానే భూములున్నాయి. రైతులు వేలం పాటలో ఆసక్తిగా పాల్గొన్నారు. అన్ని ఆలయాలకు చెందిన భూముల ద్వారా 2.17 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఈఓ వెల్లడించారు. పాట పాడిన రైతులకు ఏడాది కాల పరిమితి ఉండేది, ఈసారి రైతుల విజ్ఞప్తి మేరకు మూడేళ్లకు పొడిగించారు.

తప్పని ట్రాఫిక్ ఇక్కట్లు

బేతంచెర్ల: పట్టణంలోని డోన్ క్రాస్ రోడ్డు, బనగానపల్లె రైల్వే గేటు వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. ప్రత్యేకించి బనగానపల్లె రైల్వే గేటు పడిందంటే అటు, ఇటు వైపు వాహనాలు నిలిచిపోతాయి. ఆ సమయంలో డోన్ వెళ్లే వాహనచోదుకులకు సైతం ఇబ్బందులు తప్పడం లేదు. బనగానపల్లె వైపు వెళ్లేవాహనాలు నిలిచిపోవడంతో అప్పుడప్పుడు ట్రాఫిక్ జామ్ అతుతుంది. డోన్ వైపుతోపాటు పట్టణంలోకి వచ్చే వాహనదారులకు పడరానిపాట్లు పడాల్సి వస్తుంది. గేటు ఎత్తినప్పుడు కూడా ఇదే పరిస్థితి. ఒక్కసారిగా వాహనచోదకులు చొచ్చుకుని వచ్చినప్పుడు ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. రైల్వే గేటు పడినప్పుడు ఒక వైపు మాత్రం వాహనాలు నిలిచి ఉండేలా చర్యలు తీసుకోవాలని వాహనచోదుకులు, పట్టణ ప్రజలు కోరుతున్నారు.


బేతంచెర్ల పట్టణంలోని డోన్ క్రాస్ రోడ్డులో ట్రాఫిక్ నిలిచిపోయిన దృశ్యం

హంసవాహనంపై బుగ్గ వేంకటేశ్వరుడు



సంజామల: మండల పరిధిలోని నొస్సం గ్రామంలో వెలసిన బుగ్గ వేంకటేశ్వర స్వామి బ్రహోత్సవాలు భక్తి శ్రద్ధలతో సాగాయి. పది రోజుల పాటు స్వామి వారి బ్రహోత్సవాలు అంగరంగ వైభవంగా సాగాయి. బ్రహోత్సవాల్లో భాగంగా మంగళవారం చివరి రోజు అర్చకులు శ్రీకాంత్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ధర్మకర్త గాధం శెట్టి శ్రీరాముడు చేతుల మీదుగా స్వామివారి ధ్వజ అవరోహన, వసంతోత్సవం కార్యక్రమం నిర్వహించారు. స్వామివారు హంసవాహనంపై భక్తులు దర్శనమిచ్చారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలి


చిన్నారులకు గ్రాడ్యుయేషన్ పత్రాలు అందజేస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: మూడు సంవత్సరాలు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు గీతాలక్ష్మి, చంద్రమ్మ సూచించారు. మంగళవారం కోవెలకుంట్ల పట్టణంలోని ఆరవ అంగన్‌వాడీ కేంద్రంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. కేంద్రంలో పూర్వప్రాథమిక విద్యను పూర్తి చేసుకున్న ఐదు సంవత్సరాలు పైబడిన పది మంది చిన్నారులను ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చేరేందుకు గ్రాడ్యుయేషన్ పత్రాలు అందజేశారు. అలాగే మూడు సంవత్సరాలు పైబడిన పది మంది చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు వెంకటలక్ష్మి, అరుణ, జయమ్మ, లక్ష్మిదేవి, కమాల్‌బీ, మహాలక్ష్మి, వరలక్ష్మి, పుల్లమ్మ, బిందు, గంగమ్మ, బ్రహ్మవతి, తదితరలు పాల్గొన్నారు.

పశువైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి


రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ వెంకట రమణయ్య

సంజామల: పాడి రైతులకు సిబ్బంది అందుబాటులో ఉండాలని, పశువులకు మెరుగైన వైద్యం అందించాలని ఆళ్లగడ్డ డివిజన్ పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం.వెంకట రమణయ్య సూచించారు. మండల కేంద్రం సంజామల పశువైద్యశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో డిప్యూటీ డైరెక్టర్ మాట్లడుతూ...పాడి రైతులకు పశువైద్య సిబ్బంది అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు సీజనల్ వ్యాధులపై అప్రమత్తం చేయాలని సూచించారు. వ్యాధినిరోధక టీకాలను పశువులకు సమయానికి వేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. కార్యక్రమంలో సంజామల, కొలిమిగుండ్ల మండలాల ఏడీ మోహన్ రావు, పశువైద్య సిబ్బంది వెంకట సుబ్బయ్య, కమపూరి బాషా, బేక్, ప్రభాకర్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు కొలతల ప్రకారం చేయాలి


ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీఓ శేషన్న

బేతంచెర్ల: ఉపాధి పనులను కూలీలు ప్రతి రోజు రూ. 300 వేతనం కోసం సరైన కొలతలతో పని చేయాలని ఏపీఓ శేషన్న సూచించారు. మంగళవారం మండల పరిధిలోని అంబాపురంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన తనిఖీ చేశారు. ప్రస్తుతం ఎండలు తగ్గాయని, సూచించిన కొలతల ప్రకారం పని చేసుకోవాలన్నారు. ఉపాధి కింది చిన్నకారు రైతులు పండ్ల తోటలు సాగు చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్స్ పండ్ల తోటల సాగుకు ఉపాధి పథకం అందిస్తున్న ప్రోత్సాహాన్ని చిన్నకారు రైతులకు వివరించాలన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ శంకర్ నాయక్, ఫీల్డ్ అసిస్టెంట్ శేఖర్ పాల్గొన్నారు.

జీవో 117ను రద్దు చేయాలి


సభ్యత్వ నమోదు చేస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : ప్రభుత్వం జీవో నంబరు 117ను రద్దు చేయాలని, తెలుగు,ఇంగ్లిష్ మీడియాలను సమాంతరంగా నడపాలని యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు వెంకటసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని చిన్నమల్కాపురంలో మంగళవారం నాయకులు యూటీఎఫ్ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ బదిలీలతోపాటు పదోన్నతులు కల్పించి, అప్రెంటిస్ లేని డీఎస్సీ రిక్రూట్‌మెంట్ జరపాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సుబ్బరాయుడు, మండల ప్రధాన కార్యదర్శి గోపాల్, జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యంశెట్టి, జిల్లా కౌన్సిల్ సభ్యులు లక్ష్మీనాయక్, కోశాధికారి సుమన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న మమ్మద్‌రఫీ

డోన్ టౌన్ : వాతావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలని హెచ్ఎం సురేంద్రనాథ్, సామాజిక కార్యకర్త మమ్మద్‌రఫీ పిలుపునిచ్చారు. సాతంత్ర్య సమర యోధురాలు, దేశంలోనే తొలి మహిళా ముఖ్యమంత్రి (యూపీ) సుచేత కృపలానీ జయంతిని పురష్కరించుకొని తారకరామనగర్‌లోని ప్రభుత్వ పాఠశాల్లో ఆమె చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళుర్పించారు. ఈ సందర్భంగా ఓజోన్ పొర, భవిష్యత్‌లో ఆక్సిజన్ ఆవశ్యకత, అంటు వ్యాధులు తదిరత అంశాలపై మమ్మద్‌రఫీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అబ్దుల్‌కలాం, సతీష్‌కుమార్, మధురవాణి, శంషాద్‌బేగం, హరీష్‌కుమార్, హరికృష్ణ పాల్గొన్నారు.

బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలి


శ్రీనివాస ఏజెన్సీస్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ అబ్దుల్ హక్

అవుకు: రైతులు కొనుగోలు చేసిన మందులకు, ఎరువులకు దుకాణాదారులు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని ఏఓ అబ్దుల్ హక్ ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రం అవుకులోని శ్రీనివాస ఏజెన్సీస్, ఎంసీఎస్ నరసింహులు ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్ ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. స్టాక్ రిజిష్టర్స్, బిల్ బుక్స్ పరిశీలించారు. ఎరువులు, మందుల నిల్వల గదులను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ఎరువులను అధిక ధరలకు అమ్మినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ప్రభుత్వం నిషేధించిన బయోపెస్టిసైడ్స్‌ను దుకాణాల్లో నిల్వ ఉంచినా, అమ్మినా లైసెన్స్‌లు రద్దు చేయడంతోపాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఆదరణ కోల్పోతున్న మట్టి పాత్ర


కుమ్మరి చక్రంపై మట్టి పాత్రలను తయారుచేస్తున్న దృశ్యం (ఫైల్), తయారైన మట్టిపాత్రలు (ఫైల్)

బేతంచెర్ల: పురాతన కాలం నుంచి మట్టి కుండలకు ఎనలేని ఆదరణ ఉండేది. మట్టితో తయారుచేసిన పాత్రలు, కడవలు తాగునీటి పెద్దబానలు ప్రతిఇంటిలో దర్శనమిచ్చేవి. దీంతో కుమ్మరి కులస్తులకు చేతినిండా పనితోపాటు వారి జీవనం సుఖంగా కొనసాగేది. ఆ రోజుల్లో మట్టిపాత్రలను వివిధ ఆకారాల్లో తయారుచేసి సమీప పట్టణాలకు, సంత రోజుల్లో గ్రామాలకు తీసుకెళ్లి విక్రయాలు జరిపి జీవనం గడిపేవారు. అలాగే ప్రాచీనకాలం నుంచి గ్రామాల్లో సిరిసంపదలు, సుఖసంతోషాలతో ఉండాలనే ఉద్దేశంతో ప్రతి 5 సంవత్సరాలకొకసారి నిర్వహించే జాతర ఉత్సవాల్లో అమ్మవారి ఉత్సవ మూర్తులను తయారుచేయడంలో వారిదే కీలక పాత్ర. దీంతో పాటు ప్రతి ఏడాది ఘనంగా నిర్వహించుకునే వినాయకచవితి ఉత్సవాలకు రంగురంగుల విగ్రహాలను తయారుచేసి అమ్మకాలు కొనసాగిస్తుంటారు. ఆ రోజుల్లో పక్క మండలమైన ఓర్వకల్లు, వెల్దుర్తి, డోన్ తదితర మండలాలకు ఎడ్లబండ్లపై కుండలను, మట్టి కడవలను తీసుకెళ్లి కొర్రలు, జొన్నలు, కందులు తదితన ధాన్యం తీసుకొని కుండలను విక్రయించేవారు. దీంతో తిండి గింజల కొరత ఉండేది కాదని కుమ్మరి కులస్తులు పేర్కొంటున్నారు. మండల పరిధిలోని రంగాపురం, సుంకులాపురం, యంబాయి, బేతంచెర్ల, సిమెంట్‌నగర్ గ్రామాల్లో దాదాపు 400 కుటుంబాలు ఉండగా అందులో 150 కుటుంబాలు కుమ్మరి వృత్తిపైనే ఆధారపడి జీవనం సాగించేవారు. మిగతా వారంతా వ్యవసాయ పనులు, కూలీ పనులు చేసుకునేవారు. పెరిగిన ఆధునిక టెక్నాలజీ దృష్ట్యా మట్టి పాత్రల స్థానంలో స్టీల్, రాగి, కంచు పాత్రలు, బిందెలు రావడంతో వీటికి ఆదరణ కరువైంది. నాడు 150 కుటుంబాలు కులవృత్తిని చేపట్టగా నేడు 30 కుటుంబాలు మాత్రమే ఈ వృత్తిని కొనసాగిస్తున్నాయి. పెరిగిన ఆధునికత దృష్ట్యా మట్టిపాత్రలపై ప్రజలు మక్కువ చూపకపోవడంతో ఆదరణ కోల్పోయాయి. దీంతోపాటు ప్రభుత్వ ప్రోత్సాహం కూడ కరువవ్వడంతో కష్టానికి తగ్గ ఫలితం లభించక చాలా మంది ఈ వృత్తిని మానేశారు. ప్రస్తుతం వాడుతున్న స్టీల్, వివిధ లోహాలతో తయారుచేసిన పాత్రలతో అనారోగ్యం పాలవుతున్నా వాటిపైనే మక్కువ చూపుతున్నారని, మట్టి పాత్రలు వాడితే ఎటువంటి రోగాలు వచ్చేవి కాదని కుండల తయారీదారులు పేర్కొంటున్నారు. గతంలో ఇంటింట మట్టి పాత్రలు ఉండగా నేడు వాటి స్థానంలో స్టీల్ పాత్రలు దర్శనమిస్తున్నాయి.